క్లుప్తంగా

కార్మికుల హక్కుల పరిరక్షణకు చట్టాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి హనీష

భీమవరం: అసంఘటితరంగ కార్మికుల హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నా యని వాటిపై అవగాహన కలిగి ఉండాలని భీమవరం ఒకటో అదనపు సివిల్ జడ్జి పి.హనీష అన్నారు. సోమవారం భీమవరం యూటీఎఫ్ భవనంలో ఏర్పాటు చేసిన అసంఘటిత రంగ కార్మికుల హక్కులపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్జి హనీష కనీస వేతన చట్టం, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్‌కుమార్, ఎస్.సుధీర్, పి.అంబేడ్కర్, కె.జ్యోతి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక సిద్ధాంతాన్ని అందించిన కారల్‌మార్క్స్



కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భీమవరం: ప్రపంచాన్ని ప్రభావితం చేసే మానవాళికి కార్మిక, కర్షకులకు ఆచరణాత్మక సిద్ధాంతాన్ని కారల్‌మార్క్స్ రూపొందించారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. సోమవారం భీమవరం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్, బి.వాసుదేవరావు, జె.సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, కె.రత్నకుమారి, సీపీఐ నాయకులు కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాస్, నాగిడి శాంతమూర్తి, చాన్‌భాషా, తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ సభ

భీమవరం: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేతను తక్షణం నిలుపుదల చేయాలని కోరుతూ మంగళవారం పాత బస్టాండ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో భారీ బహి రంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ తెలిపారు. ఈ బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య వక్తగా హాజరవుతారని తెలిపారు.

7వ తేదీన నిరాహార దీక్ష

ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు పేదలపై చేస్తున్న దాష్టీకాన్ని నిరసిస్తూ ఈ నెల 7వ తేదీన నిరాహార దీక్ష చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఈ నిరాహార దీక్షను అల్లూరి సీతారామరాజు 101 వర్ధంతి సందర్భంగా చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. నిరహార దీక్షలో పార్టీ జిల్లా కార్యదర్శి గోపాలన్ పాల్గొంటారని తెలిపారు.

ఎంపీడీవోకు వీడ్కోలు



ఎంపీడీఓ రవీంద్ర దంపతులను సత్కరిస్తున్న అధికారులు

ఉండి: ఎంపీడీవో పదోన్నతిపై విశాఖ జిల్లా డీఎల్‌డీఓగా బదిలీ అయిన ఎస్.రవీంద్రకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో మంచి ప్రతిభ కనబరిచి పదోన్నతిపై విశాఖ జిల్లాకు వెళుతున్న ఎస్.రవీంద్ర భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితిలో నిలవాలని తహసీల్దార్ నాగార్జున కోరారు. కార్యక్రమంలో పంచాయతీ గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితర అధికారులు పాల్గొని రవీంద్ర దంపతులను ఘనంగా సత్కరించారు.

సీసీ రోడ్ల ప్రారంభం

కాళ్ల: మండలంలోని దొడ్డనపూడిలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, సర్పంచ్ కొల్లి సుబ్బారావుతో కలసి సోమవారం ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన

పెనుగొండ: నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీ మాత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నుంచి నగరేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకంలు, అర్చనలు నిర్వహించారు. మహిషాసురమర్దినికి కుంకుమార్చనలు చేశారు. వాసవీ మాతకు ఆలయ ప్రధాన అర్చకుడు కోట వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన వేద మంత్రాలతో నిర్వహించారు.

ప్రభుత్వ నిర్లక్ష్య‘మే’

- అలస్యంగా సాగు ఆపై అగచాట్లు
- ఇంకా కొన‘సాగు’తున్న పది శాతం పంట

ఆకివీడు: భారీ వర్షాలకు, వరదలకు ఖరీఫ్ పంట మండలంలోని పలు గ్రామాల్లో తుడిచిపెట్టుకుపోయింది. దాళ్వా సాగు కూడా ఆలస్యంగా చేపట్టవలసి వచ్చింది. పంట పొలాల్లో తిష్ట వేసిన తూడు, గుర్రపు డెక్క, తామర మొక్కలను తొలగించడంలో తీవ్ర జాప్యం చేసింది. ముంపునీరు బయటకు అలస్యంగా వెళ్లడంతో దాళ్వా సాగు వేసేందుకు అవకాశం లేకపోయింది. దీంతో ముందస్తు దాళ్వా కన్నా, వెనకస్తు దాళ్వానైనా సాగు చేసి గుప్పెడు గింజలు పొందుదామని రైతులు సాగు చేపట్టారు. జనవరి, ఫిబ్రవరిలో కూడా నాట్లు వేయాల్సి వచ్చింది. తక్కువ కాలం పంట సాగు చేపట్టినప్పటికీ సకాలంలో పంట చేతికి వచ్చినప్పటికీ ప్రకృతి విరుచుకుపడి ఈదురుగాలులు, ఆకస్మిక భారీ వర్షానికి రైతులు అధిక శాతం మంది గురికావలసి వచ్చింది.

80 శాతం మాసూళ్లు అయినప్పటికీ

నియోజకవర్గంలో 80 శాతం మాసూళ్లు పూర్తయినప్పటికీ మిల్లులకు మాత్రం 45నుంచి 50శాతం ధాన్యం మాత్రమే చేరింది. మిగిలిన ధాన్యం కళ్లాల పైనే ఉంది. రైతులు రాశులుగా వేసుకుని తేమ శాతాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ తరుణంలో భారీ ఈదురు గాలులు, భారీ వర్షం కురవడంతో రాసుల్లో ఉన్న ధాన్యం కొన్ని చోట్ల తడిసింది.

కొన్ని మిల్లుల టార్గెట్ పూర్తి

ధాన్యం సేకరణకు ఆయా మిల్లులకు ఇచ్చిన టార్గెట్‌లో కొన్ని మిల్లులు పూర్తి చేశాయి. అదనపు టార్గెట్ ఇవ్వడంలో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించకపోవడంతో రైతులు అకాల వర్షానికి బలయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ ధాన్యంలో తేమ శాతం ఉందని మిల్లర్లు రైతులను కొన్నిచోట్ల ఇబ్బంది పెట్టడంతో ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు.



వర్షానికి పడిపోయిన దాళ్వా వరి చేను

టార్గెట్ పెంపుకు వైఎస్సార్‌సీపీ ఆందోళన

ఇటీవల జిల్లాలోని రైస్ మిల్లులకు దాళ్వా ధాన్యం సేకరణలో ఇచ్చిన టార్గెట్‌ను మరింతగా పెంచాలని వైఎస్సార్‌సీపీ ఆందోళన కార్యక్రమం చేపట్టి, జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రైతులను త్వరితగతిన ఆదుకోవాలని ధర్నా చేసిన విషయం విదితమే. ప్రభుత్వం స్పందించి రైతుల వద్ద ధాన్యం సేకరించి ఉంటే అకాల వర్షానికి రైతులు ఇబ్బంది పడేవారు కాదని పలువురు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం తాత్సారం చేస్తోంది



దాళ్వా ధాన్యం సేరకణలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. రైతులు పండించి, మాసూళ్లు చేసి అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయలేకపోతుంది. మిల్లర్లకు ఇచ్చిన టార్గెట్ పూర్తయిందని, అదనపు టార్గెట్ వెంటనే ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ తరపున ముందస్తు హెచ్చరిక చేశాం. దళారులకు అనుకూలంగా వ్యవహరిస్తోంది. రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి తగదు. సకాలంలో సంచులు అందజేసి, కొనుగోలుకు సహకరించాలి. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు నేటికీ పంటల బీమా వర్తింపజేయలేదు. – పీవీఎల్ నర్సింహరాజు, ఉండి వైఎస్సార్‌సీపీ నియోకవర్గ ఇన్‌చార్జి

ధాన్యం కొనుగోలు చేయకపోతే చర్యలు



అకాల వర్షం, ఈదురుగాలులకు తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకపోతే చర్యలు తప్పవు. కల్లాల్లో ధాన్యాన్ని రైతులు టార్పాలిన్‌తో కప్పినప్పటికీ ఈదురు గాలులు, భారీ వర్షానికి కొన్నిచోట్ల తడిసినట్లుగా సమాచారం అందింది. తడిసిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉన్నప్పటికీ మిల్లర్లు కొనుగోలు చేయాలి. రైతుల వద్ద నుంచి అధిక సొమ్ము వసూలు చేస్తే తహసీల్దార్ కార్యాలయానికిగాని, వ్యవసాయ శాఖ అధికారికి గాని తెలియజేయాలి. – ఎస్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్, ఆకివీడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: కోలమూరు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి చాలా విద్యుత్ స్తంభాలు పడిపోయి విరిగిపోయాయి. కావున వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు నిమిత్తం, లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోలమూరు, పాందువ్వ, కలిగొట్ల, ఆరేడు, పాములపర్రు ,గ్రామాలతో పాటు సంబంధిత ఏరియాల్లో ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాటర్ స్కీమ్ పరిశీలన

ఉండి: ఉండిలో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ స్కీమ్, తాగునీటిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెళ్లడంతో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ తానింకి శ్రీనివాస్, అధికారులు పరిశీలించారు. ఉండి సంత మార్కెట్‌లోని రక్షిత మంచినీటి చెరువు వాటర్ స్కీమ్‌ను పరిశీలించిన అధికారులు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదని నీటిని పరీక్షించగా మంచి ఫలితాలు వచ్చాయని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. అలాగే పంచాయతీ అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు తాగునీటిని పరిశీలించి కాలుష్యం లేకుండా చర్యలు చేపట్టాలని డీఈ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, పంచాయతీ కార్యదర్శి అనిల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు కూటమి మొండిచేయి

- సూపర్ సిక్స్‌ను గాలికొదిలేసిన సర్కారు
- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు కామన నాగేశ్వరరావు

కాళ్ల: కూటమి ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తూ సూపర్ సిక్స్‌ను గాలికొదిలేసి, వారి దోపిడీకి అనుకూలమైన పథకాలను ప్రవేశపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు బంధన పూర్ణచంద్రరావు ఆరోపించారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీల పార్టీ అని చెప్పుకుంటూ కూటమి నాయకులు అధికారం చేపట్టి 10 నెలలు గడుస్తున్నా బీసీలకు చేసిందేమీ లేదన్నారు. కేవలం దోచుకోవడం, దాచుకోవడమే అజెండాగా ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో మహిళలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఖాతాలకు నేరుగా సంక్షేమ పథకాలు జమ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. బీసీలకు, మహిళలకు అన్యాయం జరిగితే ఊరుకోమని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో బీసీలకు అనేక హామీలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలకు పెద్దపీట వేస్తామని అనేక రకాలుగా లబ్ధి చేకూరుస్తామని చెప్పి బీసీ మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. బీసీ మహిళలకు సంబంధించి కుట్టు మిషన్లు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. అందులో భాగంగా లక్ష మందికి లబ్ధి చేకూర్చే విధంగా టెండర్లు పిలిచారన్నారు. ఒక్కో లబ్ధిదారురాలికి రూ.23వేలు లబ్ధి చేకూరే విధంగా ఏర్పాటు చేశారు. కానీ ఒక్కో లబ్ధిదారురాలికి రూ.7300 మాత్రమే చేరిందన్నారు. కుట్టు మిషన్‌కు రూ.4300, శిక్షణకు రూ.3 వేలు మాత్రమే ఖర్చు పెట్టారని ఎద్దేవా చేశారు. రూ.23 వేలల్లో రూ.7300 మాత్రమే లబ్ధిదారులకు ఖర్చుపెట్టి మిగిలిన రూ.15,700 అన్యాయంగా దోచుకున్నారని ఆరోపించారు. దీంట్లో సుమారు 167 కోట్ల అవినీతి జరిగిందని ఘాటు విమర్శలు చేశారు. పరిజ్ఞానం లేని సంస్థలకు టెండర్లు అప్పగించి దోచుకున్నారని తీవ్రంగా ఖండించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ తరపున కోర్టును ఆశ్రయిస్తామని ప్రజల పక్షాన రైతుల పక్షాన మహిళల పక్షాన వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో బీసీ నాయకులు గలావల్లి ధనుంజయ, జహంగీర్, పి.లక్ష్మీచక్రధర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ నిరసన



తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

భీమవరం: పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయకుండా కాలయాపన చేస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం అన్నారు. సోమవారం పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల కోసం భీమవరం తహసీల్దార్ ఆర్.రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రకాశం మాట్లాడుతూ ఒక్కో పాఠశాలలో ఒక్కో విధమైన ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు బకాయి ఉన్న రూ.30 వేల కోట్లు వెంటనే చెల్లించాలని, బకాయి పడ్డ మూడు డీఏలను చెల్లించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి.ప్రసన్నకుమార్, శ్రీనివాస్, పి.పేతురు, టి.ఏసోబు, నరేంద్ర, టి.రాంబాబు, రమేష్‌బాబు, వై.బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పాలకోడేరు: గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



భీమవరం: వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్‌లో శిక్షణ ఇస్తున్న మాస్టర్

పాలకోడేరు: శాఖా గ్రంథాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పాలకోడేరు శాఖా గ్రంథాలయాధికారి జి.బాలరాజు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ప్రతిరోజూ విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, మెదడుకు పదును పెట్టే ఆటలైన చెస్, క్యారమ్స్ బోర్డ్ వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

విద్యార్థులకు చెస్‌లో శిక్షణ

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చదరంగంలో శిక్షణ ఇచ్చారు. అలాగే ఎండీ సరోజిని బాబోయ్ దెయ్యం అనే కథలో ధైర్య సాహసాలుంటే ఎంతటి సమస్యనైనా అధిగమించొచ్చనే నీతిని, భగవద్గీత సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, డ్యాన్స్ మాస్టర్ జె.శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కాళ్ల: సుమారు 25 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు కాళ్ల హైస్కూల్ వేదికైంది. 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఒకచోట కలిశారు. 25ఏళ్ల క్రిందట కలిసి చదువుకున్న విద్యార్థులు అంతా ఓ చోట కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. వారంతా ఒక చోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. వారంతా పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. మరోసారి కలుద్దాం అంటూ ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన స్నేహితులను తోటి విద్యార్థులు అభినందించారు.

పీజీఆర్ఎస్‌కు నాలుగు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)కు నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. మండలంలోని రాజులపేటలో ఓల్డ్ వయ్యేరు పంట కాలువపై అనుమతి లేని ఇనుప వంతెనలు, అక్రమ తూరలు వేశారని వాటిని తొలగించాలని ఆ ప్రాంత రైతు జీవీఎస్ఎస్ నారాయణరాజు ఫిర్యాదు చేశారన్నారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టి రూ.9 లక్షల నగదు, 45 కాసుల బంగారు ఆభరణాలు 2023 సెప్టెంబర్ 9వ తేదీన దోచుకుపోయారని స్థానిక రైల్వే ఫీడర్ రోడ్డుకు చెందిన కెవీఆర్ బాబు ఫిర్యాదు చేశారని చెప్పారు. స్థానిక 12 వార్డులోని కార్మిక నగర్‌కు చెందిన ఐదుగురు నిరుపేదలు తమ ఇళ్లను అన్యాయంగా తొలగించారని, తమకు ఏ విధమైన పట్టా ఇవ్వలేదని, పట్టా ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు నష్ట పరిహారంగా సొమ్ము ఇవ్వాలని సాలెపు రమణమ్మ, రంగమ్మ, రామాడి లక్ష్మి, పి.సత్యవతి, కె.కాంతమణి ఫిర్యాదు చేశారన్నారు. సిద్ధాపురం గ్రామంలో రోడ్డు మీద రోడ్డు వేస్తున్నారని నాగముసేంద్రరావు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

పది ప్రతిభావంతులకు అవార్డులు



పురస్కారాలు అందుకున్న టెన్త్ విద్యార్థులు

భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు భీమవరం పట్టణంలోని మానవతాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందించారు. స్థానిక ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మానవతా సంస్థ ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాలే కాకుండా గత రెండేళ్లుగా ప్రతిభ కలిగిన టెన్త్ విద్యార్థులకు నగదు అవార్డులు అందిస్తూ ప్రోత్సాహించడం మరింత మందికి స్ఫూర్తినిస్తుందన్నారు. మానవతా విస్తరణ అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకీరామరాజు, సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన వర్మ మాట్లాడుతూ భీమవరం పట్టణ, మండల స్థాయిలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విజేతలకు గుంటూరుకు చెందిన పి.రమాదేవి సహకారంతో నగదు అవార్డులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. మానవత సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, కో చైర్మన్ కార్మూరి నర్సింహమూర్తి, కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వర ప్రసాద్, డైరెక్టర్లు ఇందుకూరి ప్రసాదరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, వడి వెంకటేశ్వరరావు, కేఎస్ఎస్ఎన్ రాజు, కలిగొట్ల గోపాలశర్మ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూలీలకు బీమా తప్పనిసరి



కూలీలతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ సభ్యులు

నరసాపురం రూరల్: అసంఘటిత రంగంలో పని చేసే వారు శ్రమ్ వెబ్ పోర్టల్‌లో నమోదయితే ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారం పొందే వీలుంటుందని ప్యానల్ న్యాయవాదులు డి.నరసింహరాజు, డి.చాంముడేశ్వరి పేర్కొన్నారు. నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలో న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడారు. అసంఘటిత రంగంలోని కార్మికులు ఈ శ్రమ్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఫీల్డ్ ఆఫీసర్ వెంకట లక్ష్మీపతి, పీఎల్‌వీఎం పాల్గొన్నారు.

ఆక్వా సాగుపై శిక్షణ

ఉండి: ఈ నెల ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు ఆక్వా సాగులో సాంకేతిక పరిజ్ఞానం, మెలకువలు, మెరుగైన ఆక్వా సాగు విధానాలపై ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్ ఉండిలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీవో రాంబాబు సోమవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని నాగరాణి ప్రారంభిస్తారని తెలిపారు. ఆసక్తి గల ఆక్వా రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆక్వా సాగులో మెలకువలు సాంకేతిక విధానాన్ని మెరుగుపరుచుకుని ఆక్వాలో మరింత అభివృద్ధి సాధించాలని ఎఫ్‌డీవో కోరారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



బరువానిపేటలో ప్రమాదకరంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మలుపు



బరువానిపేటలోని మరో మలుపు వద్ద మార్జిన్ లేకుండా ఉన్న రహదారి

భీమవరం అర్బన్: మండలంలోని లోసరి పంచాయతీ పరిధిలో బరువానిపేటలో ఆర్ అండ్‌బీ రోడ్డు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డు భీమవరం నుంచి గొల్లవానితిప్ప, గుట్లపాడు, తోకతిప్ప గ్రామాల మీదుగా లోసరిలోని బరువానిపేట వద్ద జాతీయ రహదారి 216(ఎ)లో కలుస్తుంది. నూతనంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడటంతో నిత్యం వందలాది వాహనాలు కృష్ణా జిల్లా, విజయవాడ, రాజధాని అమరావతికి దగ్గరి మార్గం కావడంతో రాకపోకలు ఎక్కువగా సాగిస్తున్నారు. అయితే బరువానిపేటలో ఇళ్ల సమీపంలోని మలుపు ప్రమాదకరంగా ఉంది. ఆ మలుపు వద్ద ఇళ్లు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

మార్జిన్లలో గ్రావెల్ వేయని వైనం

ఈ మార్గం గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ రోడ్డు మలుపు మార్జిన్లలో గ్రావెల్ వేయకపోవడంతో తరచూ వాహనాలు దిగబడిపోవడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అంతే కాకుండా మార్జిన్‌లో వర్షపు నీరు నిల్వ ఉండిపోతుందని చెబుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా హెల్మెట్లు ధరించండి, మద్యం తాగి వాహనం నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోకండని పోలీస్‌శాఖ వారోత్సవాలు నిర్వహిస్తుంది. కాని ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎంతో మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు అవుతున్నారని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్చరిక బోర్డుల ఊసే లేదు

ఆ రెండు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు స్పీడ్‌గా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా కనీసం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకుండా ప్రయాణికులు, వాహనదారుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు కోరుకుంటున్నారు.